

ట్రెయిన్ చాలా వేగంగానే కదులుతోంది. నా మదిలో ఆలోచనలు అంతకంటే వేగంగానే కదులుతున్నాయి. ఐనా అంత అర్జంటుగా రమ్మని నాన్నగారు ఉత్తరం ఎందుకు వ్రాసినట్లు? మొన్ననే కదూ తను వెళ్ళవచ్చింది. మళ్ళీ ఇంతలోనే ఏమి రాచకార్యాలూడి పడుంటాయి? ఏదైనా ప్రమాద మయినదే జరిగితే టెలిగ్రాం ఇచ్చి ఉండేవారు కదా! మనసును కుదుట పరుచుకుంటూ కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాను. రైలుతోపాటే వేగంగా కదులుతున్నట్లుండే చెట్లను. ఆ ప్రకృతి దృశ్యాలను చూస్తుంటే కనీసం వాటిని వర్ణించడానికన్నా నేనొక రచయిత్రిని ఎందుకు కాలేక పోయానా అని కోపం వస్తూంటుంది.

నా ఆలోచనల్లో నే నుంటే వెనుక నుంచి ఎవరిదో కంఠం వినిపించింది: "చూడమ్మా! ఆకిటికీ తలుపు కొంచెం వేస్తావూ" అంటూ! ప్రత్యేకంగా కిటికీ ఎక్కడ ఉందో ఎంచుకుని కూర్చున్న నన్ను కిటికీ మూయ మనడంతో చిరాకు వేసింది. 'వెయ్యను' అని చెబుదామని వెనక్కి తిరిగి చూశాను. ఆవిడ కూడా నా వైపు నవ్వుతూ చూచింది. మర్యాదస్తురాలి లాగానే ఉంది. 50 ఏళ్ళు ఉంటాయేమో అని అంచనా కట్టేశాను నేను. 'చూడమ్మా! నువ్వు కూడా ఒంటరిగానే ఉన్నట్లున్నావు. కాసేపిలా కూర్చో. ఏమీ తోచడంలేదు. ఏదైనా కబుర్లు చెప్పుకోవచ్చు' అందావిడ ఎంతో పరిచయమున్నట్లు. నాకూ అలా కూర్చోటం బోర్‌గనే ఉంది. పైగా ఆవిడ మాటను కాదనలేక వెళ్ళికూర్చున్నాను. "ఎక్కడిదాకా వెళుతున్నావమ్మా నువ్వు?" చెప్పాను. ఓ. ఐతే మనిద్దరం వెళ్ళేది ఒక ఊరికే నన్నమాట. "మా అబ్బాయి ఉద్యోగం చేస్తున్నాడు అక్కడ". అడక్కుండానే చెప్పిం దావిడ. "నీ పేరేమిటమ్మా?" అడిగిందావిడ. "సుమిత్ర." "మీ అత్తారి దేవూరు?"

ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాను నేను. ఏమిటీ చొరవ అనిపించింది. కనీసం పెళ్ళయిందా అనన్నా అడక్కుండా అత్తారి దేవూరు అని అడిగేస్తుం దేమిటి? ఐనా నన్ను చూస్తుంటే పెళ్ళి అయిన దానిలా కనిపిస్తున్నానా! ఒక్కసారి నన్ను నేను పరిశీలనగా చూసుకున్నాను. వాచ్

---

రెండవ బహుమతి రూ. 25

ఎస్. స్వరాజ్యలక్ష్మి,
ఫైనల్ బి. ఎస్ సి., (సి. బి. జడ్)
ఎ. ఎన్. ఆర్. కాలేజీ. గుడివాడ.

# పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ విద్యార్థుల నిమిత్తం "చిన్న చిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము.

1. కథలు "జ్యోతి"లో రెండు మూడు పేజీలకు మించరాదు.

2. స్వకపోల కల్పితమైనస్వతంత్ర రచనలే పంపించాలి.

3. తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజీ, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జత పరచాలి.

4. ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందని రచనలు త్రిప్పి పంపబడవు. అందు చేత స్టాంపులు పంపించ నవసరం లేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా: ఎడిటర్, "జ్యోతి" సచిత్ర మాసపత్రిక, విజయవాడ-2."

8. రూ. 50లు ప్రథమ బహుమతి. రూ. 25 లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.

రిపేరికి ఇవ్వటంవల్ల రెండు చేతులనిండా గాజులు వేసుకున్నాను. జడలో పువ్వులు నిండుగా ఉన్నాయి. బొట్టూ, కాటుకా మామూలే. ఏదో మామూలు చీరే కట్టుకున్నాను. మెడలో ఒక గొలుసు ఉంది. దాన్ని పమిట లోపల వేసుకున్నాను. బహుశా అందువల్లే ఆవిడ పొరబడి ఉంటుంది. సంసారం చేసేవాళ్ళు తప్ప చదువుకునే వాళ్ళు అలా తయారవరని ఆవిడ ఉద్దేశ్యమేమో! అయినా ఏమీ ఆలోచించకుండానే అలా ప్రశ్నలు వేసేస్తుంటే జవాబులు చెప్పలేనిది నేనేనా అనిపించింది. ఐనా నాకు చిన్నప్పటి నుంచి చిన్నచిన్న అబద్ధాలు చెప్పి అందరినీ ఏడిపించటం ఒక హాబీ. (ఎవరికీ ప్రమాదం కలిగించనివి మాత్రమేసుమండీ!) అదే చిలిపికోరిక ఇక్కడా ఉదయించింది. ఆవిడ పెద్దరికం అందుకు వ్యతిరేకత చూపుతున్నా నోటికి వచ్చినపేరు చెప్పేశాను ధీమాగా 'కాకినాడ' అని. "మీనాన్నగారిపేరేమిటి? ఏం చేస్తుంటారు?" అడిగిందావిడ. అవిమాత్రం కరెక్టుగానే చెప్పేశాను. నాన్నగారిపేరు వినగానే ఒక్కసారిగా ఉలిక్కిపడిం దావిడ. నావైపు పరీక్షగా చూసింది. మొహం ప్రక్కకు తిప్పి ఊరుకున్నాను. 'ఇప్పుడు మీ పుట్టింటికి వెళుతున్నావా' అంది ఆవిడ నవ్వుతూ! 'అవునండీ' అన్నాను వినయంగా! కాసేపు ఆవిడ మొహంలో ఏదో ఆలోచన కదులాడింది. 'ఏమైనా చదువుకున్నావమ్మా' అని అడిగింది కాసేపు వూరుకుని. "ఆ! ఏదో వానా కాలం చదువులెండి. సెకండ్ ఫారం

ప్యాసయ్యాను. తరువాత నాకిష్టం లేక నేనే మానేశాను" అన్నాను. నేను చదివే బియ్యేస్సీ చదువు ఓ పెద్ద చదువని అనుకోకపోయినా నా అబద్ధాలకు నాకే నవ్వువస్తోంది. నా మట్టుకు నేను చాలా సిన్సియర్‌గా, ఆవిడ నమ్మేట్లుగానే జవాబులు చెబుతున్నాను అనుకున్నాను గాని ఆవిడ మాత్రం నాకేసి ఏదో అనుమానంగా చూస్తున్నట్లు అనిపించింది. అంతలోకి స్టేషనే వచ్చేసింది. "మరి వెళ్తానమ్మా! మళ్ళీ కలుద్దాం!" అందావిడ. మీ పిచ్చిగాని మనం మళ్ళీ ఎందుకు కలుస్తాములే అని మనసులో అనుకుని నవ్వుకున్నాను నేను.

తీరా ఇంటికి వచ్చాక అసలు కారణం తెలిసింది. మా నాన్నగారు నాకు అర్జంటుగా పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారని. పెళ్ళికొడుకు వాళ్ళ నాన్నగారికి చాలా తెలిసిన వాళ్ళట. ఈ సంబంధం తప్పకుండా ఖాయమవుతుందని అమ్మ, అన్నయ్య అనుకుంటుంటే వినబడుతోంది. నాకు పెళ్ళంటే పెద్ద ఇష్టమూ లేదు. అయిష్టమూ లేదు.

అన్నయ్య వుడికించే మాటలనూ, చెల్లాయి హాస్యంగా నవ్విస్తుంటేనూ వింటూ చాలా తాపీగా హాజరయ్యాను పెళ్ళి చూపులకు. చూడగానే ఆకర్షించే విగ్రహమే అతనిది. మెల్లగా ప్రక్కకు మళ్ళించాను చూపులను. ఒక్కసారిగా గతుక్కుమన్నాను. ప్రక్కన నవ్వుతూ కూర్చుని వుంది ఆవిడ. సాక్షాత్తు ఆవిడే. మళ్ళీ కలుద్దాం అన్నమాటను ఇంత త్వరగా నిజం చేస్తుందని నేను అనుకోనే లేదు. నా ముఖం పాలిపోయింది. ఈ సంబంధం కాకపోతే మానె. నాకేమీ నష్టంలేదు. కాని ఆవిడ అలా నవ్వుతూ నా ఎదురుగా కూర్చుని వుంటే నా వంటి నిండా తేళ్ళు, జెర్రులు ప్రాకుతున్నట్లుయింది. ఆవిడ అతనితో మెల్లగా ఏదో చెబుతోంది. అతను అడుగుతున్నాడు. పేరేమిటి? ఏమి చదువుతున్నారు? ఎక్కడ చదువుతున్నారు? అని. చెప్పాలనిపించలేదు. కాని ఎదురుగా నాన్నగారు వున్నారు. మరి అన్నీ నిజాలే చెప్పాల్సి వస్తోంది. ఈ పెళ్ళి జరగదనే నాకనిపించింది. తల దించుకుని కూర్చున్నాను. నాన్నగారు లోపలకు వెళ్ళమ్మా అనగానే ఒక్కసారి అతని వైపు చూచి లోపలకు వచ్చేశాను. ఆ కళ్ళు నన్ను చూసి నవ్వుతున్నట్లనిపించింది. "అమ్మాయి నచ్చింది. మరి ముహూర్తం పెట్టించండి." ఆవిడకంఠం వినిపిస్తోంది. ఆశ్చర్యపోయాను నేను. ఐతే, ఐతే ఆవిడకు నా మీద దురభిప్రాయం లేదన్న మాట. వెళ్ళేముందు ఆవిడలోపలకు వచ్చింది. 'క్షమించండి' అన్నాను ఇంకే మనాలో తెలియక. 'మీ నాన్నగారి పేరు చెప్పగానే నువ్వెవరో నాకు తెలిసింది. అయినా నాదీ పొరబాటే. పెళ్ళయిందా అని అడక్కుండానే మిగతావన్నీ అడిగేశాను. ఇంతకూమావాడు నీకునచ్చాడా!" అంది ఆవిడ నవ్వేస్తూ! సిగ్గుతో తల దించుకున్నాను. అప్పటినుంచీ నా హాబీని మాత్రం మానేశాను.

***